# అధికారీ... అంతరాత్మా...



ఆదివిష్ణు

"నాకు ఆస్తంటూ ఉందంటే ఈ డిగ్రీ ఒక్కటే. నాన్నసంపాదించినదంతా మా చదువులకే ఖర్చు పెట్టాడు. ఆయనకు వార్ధక్యం ముంచుకొచ్చింది. మామీద ఆధారపడ్డారు. ఆయన్ను పోషించాల్సిన బాధ్యత, కర్తవ్యం మాపైన ఉన్నాయి. డిగ్రీ తీసుకుని సంవత్సర మైనా ఉద్యోగమంటూ ఏదీ దొరకలేదు. విసిగి పోయాను.

"ఎవరో మిత్రులు చెప్పారు—హైదరాబాద్ వెడితే ఏదైనా దొరకవచ్చునని.వాళ్ళ మాటలమీద నే ఈ ఊరొచ్చాను. అమ్మా నాన్నా నా ఉద్యోగం కోసం కళ్ళల్లో జ్యోతులు పెట్టుకుని ఎదురు తెన్నులు చూస్తారు. మీ కంపెనీలో ఖాళీ ఉందని తెలిసింది. ఆశతో వచ్చాను." రామారావు చెప్పటం ముగించాడు.

ఆఫీసరు రంగనాథబాబు అతన్ని నిశితంగా పరీక్షించాడు. ఎంత బీద స్థితిలోఉన్నా అతని ముఖంలో గాంభీర్యం ఉట్టిపడుతూంది. బాగా

చెయ్యెత్తు మనిషి! చామన చాయ, కోలముఖం, ఒత్తుగా నల్లటి జుట్టు— ఉంగరాలు తిరిగింది, సన్నటి మీసం, చక్కటి కళ్ళు—స్ఫురద్రూపి.

"మీకు ఈ ఉద్యోగమ్మీద ప్రత్యేకమైన అభిమానం ఉందా?" రంగనాథబాబు అడిగాడు.

"అభిమానం ఉన్నా లేకపోయినా నాబోటి వాడు బ్రతుకదలుచుకొంటే ఏ ఉద్యోగమైనా చెయ్యక తప్పుతుందాండి? నేను దురదృష్టవంతుణ్ణి. విద్యార్థిదశ వినోదంగా ఉంటుందంటారు. అది నాకు బొత్తిగా విరుద్ధమయింది. నా చదువు అందరికీ భారమయింది. ఒక్కోసారి అనుకొనేవాణ్ణి— 'ఎన్నాళ్ళీ కష్టాలు— ఈ కాస్త చదువూ అయిందనిపించుకొన్న తర్వాత హాయిగా బ్రతకవచ్చున్లే'— అని. ఆ ఆశతోటే చదివి పాసయ్యాను. అంతా అభినందించారు. మమ్మల్ని కష్టాలు వదిలిపెట్టాయని చెప్పారు. కాని....అక్కడ్నుంచే మా కష్టాలు మరీ ఎక్కువయ్యాయి. చదువుకొనే రోజుల్లో ఉద్యోగం సంపాదించట మేమంత కష్టం కాదనుకొనే వాణ్ణి. ఇప్పుడు నా పరిస్థితి చూస్తుంటే భయం కలుగుతుంది." రామారావు కంఠం చివర్ని వణికింది.

"అసలు మీ లక్ష్య మేమిటి?" ఆఫీసరు అడిగాడు.

"నాకు లక్ష్యా లున్నాయంటే లోకం నవ్వుతుంది. ప్రశాంతంగా బ్రతకటానికే అవకాశాలు లేనప్పుడు ఇంకా లక్ష్యాలుగూడానాండి? కాని— నాకో లక్ష్యముంది. ఎప్పటికీ ఉంటుంది. నన్నింతవాణ్ణిగా చేసి, నాకోసం కష్టాలనుభవించిన అమ్మను నాన్నను సుఖపెట్టాలి. వాళ్ళు మనసారా నవ్వుతూంటే చూడాలని ఉంది. ఇంతకంటె మరో లక్ష్యం నాకు లేదు."

"సరే, మీరిక వెళ్ళచ్చు—" ఆఫీసరన్నారు.

రామారావు మెల్లగా వెనక్కుతిరిగి వెళ్ళబోయాడు.

"చూడండి." రంగనాథబాబు పిలిచాడు.

అతను ఆగిపోయాడు.

"రేపు నన్ను కలుసుకోండి. మెమో యిస్తాను. మీ అమ్మా నాన్నగార్లను తీసుకొచ్చి నెమ్మదిమీద జాయినుగావచ్చు" రంగనాథబాబు చెప్పాడు.

"సార్......" రామారావు కళ్ళల్లో వెయ్యి జ్యోతులు ఒక్కసారిగా వెలిగాయి. అతను కృతజ్ఞతాపూర్వకంగా ఆఫీసరుకు నమస్కారం చేశాడు.

"మంచిది. మీరిక వెళ్ళచ్చు."

"థాంక్యూ సార్. వస్తానండి. రేపు మళ్ళీ వస్తానండి. సెలవు సార్." అతని ప్రతి మాటలో ఆనందోద్రేకం తొణికిసలాడింది. అతను వెళ్ళిపోయాడు.

రంగనాథబాబు గట్టిగా గాలి పీల్చుకొన్నాడు. అతని మనస్సు హాయిగా ఉందిప్పుడు. "ఒక కు టుం బా న్ని నిలబెట్టాను"—అంతరాత్మ దీమాగా, గర్వంగా అనుకుంది. ఈ విషయాన్ని,

*ఎవరు ఏమాట చెప్పినా శ్రద్ధతో ఆలకించాలి; పెద్దలు అయినవారు, అందునా గురువులు చెప్పినమాటలు మరీను. ఆచరణ యోగ్యామో కాదో నిర్ణయించుకొనే శక్తి సామర్థ్యము వయసు లేనప్పుడు భక్తి ప్రపత్తులు, అన్నిటినీ మించి నమ్మకము ఆధారం అవుతాయి. కాని జీవితంలో పరీక్షకు వచ్చినప్పుడు ఆ పెద్దల మాటలు ఎంతమట్టుకు తోడు రాగలవో అనుభవం వల్లగాని తెలుసు కొనడం కష్టం.*


తనుచేసిన నిర్ణయాన్ని అహల్యకు వెంటనే చెప్పాలనిపించింది. ఆమె ఈ సంగతి విన్నతర్వాత ఎంతగానో సంతోషిస్తుంది.

పైన ఫాన్ విసురుగా తిరుగుతూంది—సిగరెట్టు తీసి ముట్టించాడు రంగనాథబాబు. రామారావుకు ముందు మరో ముగ్గురు, ఉన్న ఆ ఒక్క ఖాళీకోసం వచ్చారు. ముగ్గురూ గ్రాడ్యుయేట్స్. అయితే వాళ్ళందరిలో రామారావు తన మనస్సుకు బాగా నచ్చాడు. అతని కుటుంబ విషయమై అతను చెప్పిన ప్రతి చిన్న విషయమూ రంగనాథబాబును కదిల్చివేసింది. అతను చెప్పిన దంతా వాస్తవమైతే రంగనాథబాబు పడిపోనున్న ఒక కుటుంబాన్ని లేవనెత్తినట్టే. ఒకవేళ కల్పనైతే? రామారావు నటుడు గావచ్చు. లౌక్యం తెలిసిన మేధావి గావచ్చు. నిజంగా అటువంటి వాళ్ళే కంపెనీకి కావల్సింది. ఏ విధంగా చూచినా రామారావు తనకు నచ్చాడు.

ఫోను మ్రోగింది.

"నేను రంగనాథాన్ని మాటాడుతున్నా!.... అహల్యా—బాబు కులాసాయేనా....ఆ...ఆహా.... మళ్ళీ సాయంకాలం వస్తానన్నారా:....ఫీజు తీసుకోలేదా? ఏమిటీ..... అయితే సాయంత్రం నేను ఎర్లీగా వస్తాను..... ఆ..ఆ.. సరే." ఫోను పెట్టేశాడు. డాక్టరు ఫీజు తీసుకోలేదా?

రంగనాథబాబుకు డాక్టర్ విశ్వనాథంతో మంచి పరిచయం ఉంది. ఇద్దరూ క్లబ్బు మిత్రులు. బాబుకు ఈమధ్య టైఫాయిడ్ వచ్చింది. రేయింబగళ్ళూ వాడిగురించి నిద్రాహారాలు మానుకొని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది అహల్య! అటువంటి స్థితిలో బాబుకు ప్రాణం పోశాడు విశ్వనాథం. ఏ క్షణాన కావలిస్తే ఆ క్షణాన రెక్కలు కట్టుకొని వాలేవాడు. తన లోపం లేకుండా వైద్యం చేశాడు. వస్తుతః విశ్వనాథం నిపుణుడు. హైద్రాబాద్‌లో పేరున్న పెద్ద డాక్టర్లలో ముఖ్యుడు. బాబు స్వస్థతకు ఇది ముఖ్య కారణం. మనసులోనే విశ్వనాథానికి ధన్యవాదాలు తెలుపుకొన్నాడు రంగనాథబాబు.



గుమాస్తా ఆఫీసరు సంతకాలుకోసం ఫైళ్ళు తీసుకొచ్చాడు. వెరిఫై చేసి సంతకాలు పెట్టడం మొదలెట్టాడు రంగనాథం. పనంతా పూర్తయ్యే సరికి బాగా చీకటి పడింది.

రంగనాథబాబు కారు ఇంటిదగ్గర ఆగేసరికి గంట ఎనిమిదయింది. అప్పటికే వరండాలోని ఈజీ కుర్చీలో కూర్చుని విశ్వనాథం పేపరు చదువుతున్నాడు.

"హల్లో—చాలా లేటయిం దనుకొంటాను. సారీ......పెందరాళే వద్దామనుకొన్నాను. రాలేకపోయాను."

"మరేం ఫర్వాలేదు. నేనూ ఇప్పుడే వచ్చాను. ఒక ముఖ్యమైన కేసు. ఇప్పటివరకూ తెమిలింది గాదు."

"సార్యం! కాస్త కాఫీ పట్రావోయ్." రంగనాథబాబు మరో కుర్చీలో కూర్చున్నాడు.

"అహల్య చెప్పింది మీరు ఫీజు తీసుకోలేదుట. ఇది నాకు నచ్చలేదు" రంగనాథబాబు డాక్టర్ని చూస్తూ అన్నాడు.

"దాన్లో ఏముంది. మనకు మనం ఎప్పుడూ కావల్సిన వాళ్ళమే కదూ!" విశ్వనాథం నవ్వాడు.

"ఏదైనా—మీరు బాబు ప్రాణం రక్షించారు. చాలా ఋణపడి ఉన్నాం. మా సంతోష చిహ్నంగా మీరు ఫీజు తీసుకోక తప్పదు."

"బాబు ప్రాణం నా చేతుల్లో ఉందనే దానికంటే భగవంతుడు దయామయు డనండి, మిష్టర్ రంగనాథ్." విశ్వనాథం సిగరెట్టు కేసు తెరిచాడు. ఒకటి రంగనాథబాబుకు ఇచ్చి తనూ ఒక సిగరెట్టు ముట్టించాడు. క్షణాల తర్వాత కాఫీ వచ్చింది. ఇద్దరూ తాగారు.

"మీతో ఒక విషయం మాటాడాలని వచ్చాను" నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అన్నాడు విశ్వనాథం.

"చెప్పండి" తాపీగా అన్నాడు రంగనాథబాబు.

"చిన్న విషయమే. మాకు దూరపు బంధువు వేంకట్రావని మెట్రిక్యులేటు ఉన్నాడు. అతను స్కూల్ ఫైనల్‌తో పోరాడి, విసిగిపోయి—చివరి కెలాగైతేనేం మెట్రిక్యులేషను పాసయ్యాడు. పై చదువులు చదవటానికి ఓపిక లేదని ఖరారుగా చెప్పాడు. అతని తల్లితండ్రులు నన్నేదైనా ఉద్యోగంచూచిపెట్టమనిచెప్పారు. ప్రస్తుతంఅతను నాదగ్గరే ఉంటున్నాడు. మీ కంపెనీలో ఒక ఖాళీ ఉందని తెలిసింది. మీకేమీ శ్రమ లేకపోతే అతన్ని అపాయింట్ చేసుకొంటారని తలుస్తా." సిగరెట్టు దమ్ము ఒక్కటి గట్టిగా పీల్చి వదిలాడు

# అధికారీ - అంతరాత్మ

విశ్వనాథం.

రంగనాథబాబుకు పిడుగు పడినట్టయింది.

"మీకు శ్రమ కలిగిస్తున్నానేమో..." పెదాలమీదుగా అన్నాడు విశ్వనాథం.

"శ్రమ కాదనుకోండి. కానీ....." రంగనాథ బాబుకు రామారావు గుర్తుకొచ్చాడు.

"సరే—అవకాశం లేకపోతే పోనీండి. అంతేగాని ఈ విషయం గురించి ఆట్టే ఆలోచించకండి. అతనికి ఉద్యోగం కాకపోతే మరోటి చూడొచ్చును. ఏమంటారు" తేలిగ్గా తేల్చిపారేసినట్టు అన్నాడు విశ్వనాథం.

"బాబుకు ఈ మందు తెప్పించి వాడండి. మళ్ళీ రేపు ఉదయం వస్తాను. ప్రస్తుతానికి సెలవు. వీలైతే—అవకాశముంటే మావాడికి ఇప్పించండి. లేకపోతే లేనేలేదు. గుడ్‌నైట్." విశ్వనాథం వరండా మెట్లు గబగబా దిగాడు.

విశ్వనాథం ఇచ్చిన మందు చీటి రంగనాథ బాబు చేతిలో రెప రెపలాడింది. డాక్టరు కారు అప్పుడే గేటు దాటి కనుమరుగయింది.

డాక్టర్!...అతని మాట, అతని చూపు— ఇంకా రంగనాథ బాబును కలవర పెడుతున్నాయి. తనిప్పు డేం చెయ్యాలి?

రామారావు గ్రాడ్యుయేటు! ఇతను మెట్రిక్యులేటు. రామారావు తనకు నచ్చాడు. రేపు రమ్మనమని మాట ఇచ్చాడు. అప్పటి అతని కళ్ళల్లో మెరిసిన ఆశను చూచి మురిసిపోయాడు. రేపు రామారావు వస్తాడు?....

డాక్టర్‌గారి చుట్టం. ప్రాణదాతకు దూరపు బంధువు. ఉన్నది ఒక్క ఖాళీ! ఎవరు యోగ్యులు? ఎవరు తనక్కావాలి?

"నన్నింతవాణ్ణి చేసి నాకోసం కష్టాలనుభవించిన అమ్మను నాన్నను సుఖపెట్టాలి. వాళ్ళు మనసారా నవ్వుతూంటే చూడాలని ఉంది"— ఒక పేదవాని లక్ష్యం.

"అతని కీ ఉద్యోగం కాకపోతే మరోటి చూడచ్చు" — ఒక ధనికుని ధీమా!

తన కేది కావాలి? తను ఎవరివైపు మొగ్గాలి?

రామారావు దీనంగా కనిపించాడు. పాలిపోయిన అతని పెదవుల్లో అమ్మహాసం మెరిసింది. "నాకు అన్యాయంచేయకండి" అంటూ ప్రాధేయపడినట్టు అగుపించాడు. రంగనాథబాబు హృదయం ద్రవించింది.

డాక్టరుగారి నవ్వూ, ములుకుల్లాంటి పలుకులూ రంగనాథబాబు మనసును భయపెట్టాయి. అటు రామారావూ, ఇటు డాక్టరూ—ఇద్దరూ తనను ముద్దాయిలా నిలబెట్టి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. రంగనాథ బాబుకు చెమట పట్టింది. తుడుచుకొన్నాడు.

చిన్నతనంనుంచీ రంగనాథబాబు న్యాయవర్తను డనిపించుకొన్నాడు. చదువుకొన్న రోజుల్లోనే అతన్నంతా ధర్మరాజని పిలిచేవాళ్ళు. పెంచి పెద్దచేసిన పరంధామయ్య బాబాయి అంటూండేవాడు—

"మా రంగం ముందెలా బ్రతుకుతాడో గాని పట్టి అమాయకుడు. తెల్లని వన్నీ పాలు, నల్లని వన్నీ నీళ్ళనుకొనే పిచ్చి మా లోకం! అచ్చు వాళ్ళ నాన్నపోలిక" అని. ఇన్నాళ్ళ బాబాయన్న మాటలు నిజమయ్యాయి.

"ఆత్మద్రోహం మహాపాపం"—తన చెవుల్లో కాంతయ్య మాస్టారు గొంతు వినుకొన్నట్టనిపించింది. "ఎన్ని కష్టాలొచ్చినా, జీవితంలో నువ్వెంత బాధపడినా ఆత్మద్రోహం చేయబోకు"—అన్నవరం కాంతయ్య మాస్టారు తనకు ఈ వేదాంతాన్ని బోధించేవాడు. చిన్న నాటి ఆయన బోధనలన్నీ అకస్మాత్తుగా గుర్తుకొచ్చాయి.

"మాస్టారూ!" రంగనాథబాబు నెమ్మదిగా గొణుక్కున్నాడు.

"ఆత్మను వంచించుకోమాకు రంగా!"— మళ్ళీ అన్నారు కాంతయ్య మాస్టారు.

రంగనాథబాబు లేచాడు. నడివడిగా తన గదిలోకి వెళ్ళాడు. బట్టలైనా మార్చకుండా సోఫాలో కూలబడ్డాడు. లైటయినా వెయ్యకుండా ఆలోచనలతో సతమతమవుతున్నాడు— ఆ చీకటిలోనే!

—తన కళ్ళముందు డాక్టరు నిలుచున్నాడు. "నేను నీ బాబుకు ప్రాణం పోశాను. కాదంటావా. నా కింత సహాయం చెయ్యలేవా? కాని గుర్తుంచుకో. ఇక మంచి మన్నంటే నాకు గౌరవముండదు. ఏం చేస్తావో? నీ ఇష్టం."

—"అమ్మ నాన్న నా ఉద్యోగంకోసం కళ్ళల్లో జ్యోతులు పెట్టుకొనిఎదురు తెన్నులు చూస్తారు. మీ కంపెనీలో ఖాళీ ఉన్నదని తెలిసింది. అందుకే వచ్చాను—రామారావు నిస్సహాయంగా తనవైపు చూశాడు.

రంగనాథబాబు కళ్ళు మూసుకొన్నాడు— అయినా సరే, ఇద్దరూ కనిపిస్తున్నారు. చెవుల్లో రింగుమని వినిపిస్తున్నాయి వాళ్ళ మాటలు. కొంత సేపటికి కాంతయ్య మాస్టారు మళ్ళీ కనిపించారు. నొసట విభూతి రేఖలూ, నిర్మల నవ్వుతో తనముందు నిలబడ్డారు. "ఈ పదవులూ, గౌరవమూ, పేరూ ప్రతిష్ఠ—ఇవన్నీ అశాశ్వతాలు. శాశ్వతం ఆత్మ! దీనికి మించిన మంచి వస్తువు మరోటి లేదు నాయనా. ఆత్మ పవిత్రమైనది రంగా!" ఖండించినట్టు చెప్పారు.

రెండు క్షణాల తర్వాత మళ్ళీ విశ్వనాథంతో పాటు మరో పది గొంతుకలు రంగనాథ బాబును హెచ్చరించాయి. ఈ చిన్న సాయాన్ని చెయ్యక తప్పదని శాసించాయి.




నంజన్‌గూడు ఔషధములకు ఒకట వునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము.



అంతరాత్మ కస్సుమంది. "బ్రతుకు తెరువు కోసం ఇంతదూరం వచ్చిన దీనుడ్ని, యోగ్యుడ్ని కాదనడానికి నే నెంతమాత్రం ఒప్పను. ఈ అవకాశం రామారావుకే చెందాలి"—

"జీవితంలో నా కిది పరీక్షా భగవాన్!" రంగనాథం ఆ చీకటిలోనే దైవానికి నమస్కరించాడు.

గదిలో లైట్లు వెలిగాయి. తలెత్తి చూశాడు. అహల్య!

"ఒంటరిగా చీకట్లో కూర్చున్నారే? డాక్టరేమన్నారు?"

"అహల్యా!" ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"ఏమిటండీ!—అసలేం జరిగిందండీ!—" అతని వాలకం చూచి జంకిపోయింది అహల్య.

"ఏమీలేదు—ఏమీలేదు." అతను సోఫాలోంచి లేచాడు.

"కాదు, ఏదో ఉంది. నాకు చెప్పకూడదా?" ఆమె ప్రాధేయపడింది.

"...... ...... ......."

"రహస్యమా?"

"అహల్యా! డాక్టరుకు మనం ఋణపడి ఉన్నాం కదూ?"

"అయితే—ఏమిటండీ ఇంతకూ?"

"ఆయన తరఫున ఎవరికో ఉద్యోగం ఇవ్వాలిట."

"ఓస్!—ఇంతేనా—ఇంతమాత్రానికే మథనపడాలా? భలేవారండీ!" ఆమె మనస్సు కుదుటపడింది. చిన్నగా నవ్వింది.

"నేను మరొకతనికి వాగ్దానం చేశాను. రేపు రమ్మని చెప్పాను. అతను వస్తాడు అహల్యా!"

"తర్వాత వెళ్ళిపోతాడు. దానికింత బాధపడవలసిన అవసర మేముంది?"

"అహల్యా!"

"బొత్తిగా ఇలా అయిపోయా రేమిటండీ!"

"ఇది మాట తప్పటం కదూ! ఆత్మవంచన కదూ!"


"అంత పెద్దమాట అనకండి స్వామీ! మనకు సాయం చేసినవారికి సాయం చెయ్యటం మన ధర్మం. అంతేగాని ఆత్మవంచ నెందుకవుతుంది?......ముందు లేవండి. బాత్‌రూంలో నీళ్ళు కాగుతున్నాయి. స్నానం చేసిరండి. లేవండి."

రంగనాథబాబు యాంత్రికంగా లేచాడు. స్నానంచేసి బట్టలు మార్చుకొన్నాడు. హాల్లోకి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు. సిగరెట్టు కాలుస్తూ ఆలోచిస్తున్నాడు.

"అయ్యో! మళ్ళీ కూర్చున్నా రేమిటండీ! లేవండి. అవతల అన్నీ వడ్డించి ఉన్నాయ్!" ఆమె భర్త స్థితికి జాలి చెందింది.

"నా కిప్పుడు ఆకలిలేదు అహల్యా! నన్ను మాటాడించకు."

"మీ మనస్సు పాడు చేసుకోకండి. ఈ చిన్న విషయానికింత ఆలోచనకూడదు. లేవండి."



శివకంచి ఏకాంబరేశ్వరాలయ మండపం

ఫోటో—ప్రఖ్య ఈశాన్ (సికిందరాబాదు)

చివరికి ఏ అజ్ఞాతశక్తి అతన్ని కదిల్చిందోగాని అతను లొంగిపోక తప్పింది కాదు. తనకు విశ్వనాథంలాటి వాళ్ళున్న సంఘంలో సనులుంటాయి. గౌరవం కొనుక్కోవచ్చు సులభంగా. బ్రతికి నన్నాళ్ళూ అందరి మన్ననలూ పొందవచ్చు. పై పదవులూ అందుకోవచ్చు. ఇదంతా లోకంతో పనిగాని ఆషామాషీ గాదు. ఆత్మను నమ్ముకుంటే చివరకు మిగిలేది వట్టి వేదాంతమే!—రంగనాథబాబు ఓడిపోయాడు. వెంటనే కాగితం కలం తీసుకుని వెంకట్రావుకు అపాయింట్‌మెంటు ఆర్డరు వేశాడు. ఆ రాత్రంతా దాదాపు కలత నిద్రలోనే గడిపాడు. తెల్లవారింది.

అహల్యా, రంగనాథబాబూ కాఫీ తాగుతున్నారు. రంగనాథబాబే ఉన్నట్టుండి అడిగాడు.

"అహల్యా! నువ్వు బాబు గురించి అన్నవరం సత్యనారాయణస్వామికి మొక్కుకున్నావ్ గదూ!"

"అవును—"

"అయితే పద. ఇప్పుడే వెడదాం."

ఆమె ఈ హఠాత్పరిణామానికి కలత చెందింది.

"అదేమిటండీ! అంత తొందర దేనికీ, తర్వాత వెళ్ళచ్చునుగా!"

"కాదు ఇప్పుడే వెళ్ళాలి. ఎందుకనో ఉన్నపళంగా అన్నవరం చూడా లనిపిస్తోంది. బాబాయీ, పిల్లలూ—అందరితో వారం రోజులైనా గడపాలి. ఈ వాతావరణానికి కొన్ని రోజులు దూరంగా ఉండాలనిపిస్తోంది."

తాలాచక్కని కవైనవి




"సులేఖ"
మరియు
"బ్రీఫ్‌మన్"
ఫౌంటెన్‌పెన్‌లు

హెడ్డాఫీసు: పెన్‌మెన్ ఇండస్ట్రియల్,
సర్వీసెస్, బొంబాయి—67.
బ్రాంచి: పెన్‌మెన్ ఇండస్ట్రియల్ సర్వీసెస్,
ఇమాంవంజావీధి, బట్టలమార్కెటువద్ద,
విజయవాడ.



ప్రగతిశీల సాహిత్యం

| | | |
|---|---|---|
| మహాప్రస్థాన్ | —చలం | —5.00 |
| అనసూయ | —చలం | —2.25 |
| ఆత్మార్పణ | —చలం | —2.50 |
| తిరిగి రాలేదు | —కె. లింగరాజా | —2.25 |
| విరుద్ధఫలితాలు | —ముద్దంశెట్టి | —2.00 |
| కాంతి కిరణం | —దిలీప్ | —1.75 |
| బృందావనం | —పురాణం | —1.50 |
| తారకమంత్రం | —కవులూరి | —1.00 |
| సుందరీ—సుబ్బారావు | —తిలక్ | —2.00 |
| సుశీలపెళ్లి | —తిలక్ | —2.50 |
| గోరువంకలు | —తిలక్ | —2.00 |
| ఊరి చివర ఇల్లు | —తిలక్ | —2.00 |
| సుచిత్ర ప్రయణం | —తిలక్ | —2.00 |
| కథానోపనిషత్తు | —తిలక్ | —2.00 |
| జనవాక్యం | —కాశీ విశ్వనాథం | —0.37 |
| మహిళా ప్రబోధం | —కాశీ విశ్వనాథం | —0.31 |

ప్రజా ప్రచురణలు—ఏలూరు (ఆంధ్ర).



తాంబూలములకు
యాలక్కాయ,లవంగము ఇప్పుడు అక్కరలేదు.

రూచి



సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
½ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.
నానాకాస్మటిక్సు, విజయవాడ—2.


# అధికారీ—అంతరాత్మ

"ఇంత హఠాత్తుగా వెళ్ళడం నా కిష్టం లేదు."

"మా పొలాలు, చిన్ననాటి స్థలాలు నన్ను రమ్మనమన్నట్టు పిలుస్తున్నాయి అహల్యా! ముఖ్యంగా కాంతయ్య మాస్టార్ని చూడాలని ఉంది. ఆయన్ను వదిలి చాలా కాలమయింది—ప్లీజ్—నా గురించైనా రా! అటు అన్నవరం స్వామి మొక్కుబడి తీరినట్టూ ఉంటుంది, ఇటు నాకు మనశ్శాంతీ కలుగుతుంది. కాదనకు. త్వరగా ప్రయాణమవ్వు—" ఆమె మాట వినకుండానే తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అహల్య కిదేం నచ్చలేదు. రంగనాథబాబు అవస్థ చూస్తూంటే ఓవక్క నవ్వూ, మరో పక్క జాలీ కలుగుతున్నాయి. మరీ ఇంత పసి హృదయం పనికిరాదు. భర్తమాట కాదనలేకపోయింది. అహల్య ప్రయాణమవ్వక తప్పింది కాదు.

రంగనాథ దంపతులు బయలుదేరే సమయానికి ఆఫీసు జవాను రాజన్న వచ్చాడు. రంగనాథబాబు అపాయింట్‌మెంటు ఆర్డరు రాజన్నకు ఇచ్చాడు.

"వెంటనే టైపు చేయించి డిస్పాచ్ చెయ్యమను. వారం రోజుల్లో తిరిగివస్తానని చెప్పు. ఇక నువ్వు వెళ్ళు."

ఆఫీసరు ధోరణి అర్థంగాని రాజన్న ఆఫీసువైపు నడక సాగించాడు. అతను వెళ్ళిన కొద్ది సేపటికి రంగనాథబాబు కారు సికింద్రాబాద్ రైల్వే స్టేషనుకు వెళ్ళింది.

• • •

ఊరు ఉన్నకొద్దీ దగ్గర పడుతూంది. రంగనాథబాబు అంతరాత్మ 'నువ్వు పిరికివాడవు. లొంగిపోయావు. నాకు ద్రోహం చేశావు. భయంవేసి పారిపోతున్నావు. అంతమాత్రాన నన్ను తప్పించుకోలేవు'—అంటూ తనను బాధ పెడుతూంది. అయితే ఆ బాధ అంతా కప్పిపెట్టుకొని అహల్య ముందు లేని నవ్వును తెచ్చిపెట్టుకొని నటిస్తున్నాడు రంగనాథబాబు. మధ్య మధ్య బాబుతో ముద్దు మాటలు ముచ్చటిస్తున్నాడు.

రైలింకా పోతూనే ఉంది.

అతనింకా బాధ పడుతూనే ఉన్నాడు.

ఆత్మద్రోహమంటే ఏమిటో—రంగనాథబాబుకు ప్రత్యక్షంగా తెలిసొచ్చింది. తొలిసారిగా విషమసమస్యతో పోరాటం ప్రారంభమయింది. కాంతయ్య మాస్టారు తన తప్పు విన్నతర్వాత ఎంత బాధపడతారో, తన నెంత దూషిస్తారో! అయినా సరే—తను చేసిన తప్పును చెప్పుకోవాలి. క్షమాభిక్ష ఆయన్నుంచే వేడుకోవాలి. అప్పటికి గాని తన మనస్సుకు శాంతి చిక్కదు.

చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు. కాంతయ్య మాస్టారు ఒక్కరే తను చేసిన తప్పు వినేవారూ, విని ఓదార్చేవారూను. తతిమ్మా వాళ్ళందరికీ అసలు వాళ్ళ దృష్టిలో ఇది నేరం కాదు. మిాదుమిక్కిలి ఈ విషయం విన్నతర్వాత తనను గేలి చేస్తారు కూడా. వాళ్ళకేం తెలుసు తన మనసు?

తనతో ఇన్నేళ్ళు కాపురం చేసిన అహల్య సైతం తన నర్థం చేసుకోలేకపోయింది. పైగా చిన్న విషయమంటూ తోసిపారేసింది. అలాంటప్పుడు పరాయివాళ్ళ విషయం వేరే చెప్పాలా?

బాబాయిగాని, చిట్టన్నయ్యగాని, మీనాక్షత్తయ్యగాని ఈ సంగతి విన్నారంటే నవ్వుకుంటారేగాని ఓదార్చలేరు. తన కావలసింది ఓదార్పు!

రంగనాథబాబు దంపతులు ఇంటిముందు బండి దిగగానే వాలుకుర్చీలో పడుకున్నవాళ్ళు తిరిగ్గా లంక పొగాకు చుట్ట కాలుస్తున్న బాబాయి ఎవరన్నట్టు చూశాడు. వచ్చింది రంగనాథ బాబని తెలియగానే—

"రంగం వచ్చాడర్రా! మీనాక్షీ, రంగం వచ్చాడే! అమ్మడూ, పిల్లు తీసుకురామ్మా!" ఇంట్లోవాళ్లందరికీ రంగనాథం రాక ప్రకటించాడు బాబాయి. మీనాక్షత్తయ్య కొంగు సవరించుకుంటూ గుమ్మం దాటి వచ్చింది. అరుంధతక్కయ్య వాళ్లకు ఎదురొచ్చింది.

"ఏరా రంగం! ఇంత హఠాత్తుగా వచ్చావ్? అమ్మాయ్— బాబు ఏడీ ఇలా ఇవ్వు తల్లీ." బాబాయి చుట్టముక్క పారేసి బాబు నెత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు.

"ఉత్తరమైనా రాయకుండా వచ్చావేంరా రంగం!"

ఒక్కసారి రంగనాథబాబు ఒళ్ళు ఆప్యాయంగా నిమిరి అత్తయ్య అంది: "అయ్యో నాయనా! బొత్తిగా చిక్కిపోయావేం? ఇన్నాళ్ళు బాబుకు జ్వరమని రాశావు—నువ్వూ పడ్డావా?"

అందరికీ నవ్వుతూ జవాబు ఇచ్చాడు.

అప్పటి కప్పుడు భోజనా లేర్పాటయినవి. భోజనాలయిన మిాదట అంతా తీరుబడిగా కూర్చుని మాట్లాడుకొంటున్నారు. చిట్టన్నయ్య అడిగాడు-ఈ రాకకు కారణ మేమిటని. బాబుకు మొక్కుబడి తీర్చటానికని రంగనాథ బాబు టూకీగా చెప్పాడు.

ఇంతలో పక్కగదిలో గలగలమని నవ్వులు వినిపించాయి.

అహల్య తన విషయమంతా చెప్పి ఉంటుంది. అందుకే నవ్వుతూన్నారు- "వాడి సంగతి మొదట్నుంచీ నాకు తెలుసమ్మా! పిచ్చి మాలోకం! పరాయివాళ్లు బాధ పడుతూంటే వాడు ఓర్చుకోలేడు. ఇంతకూ వాడి

(తరువాయి 47వ పేజీలో)

## అధికారీ - అంతరాత్మ

(24వ పేజీ తరువాయి)

మనమ్మ ఊరి మీదకు పోయిందన్నమాట! బాగానే ఉంది." బాబాయి గొంతు వినాలను కొంటే అరమైలు దూరమైనా అభ్యంతర ముండదు.

"అప్పీ మా పెద్దాడి పోలికలే! ఆ ఉద్యోగం ఎవరి కిస్తే యేం? ఇంతలో ఏం మునిగి పోయిందనీ రభస! వాడికంటె ఆరేళ్ల వసి కూన వయం." మీనాక్షత్తయ్య చివర్ని వవ్వింది.

అంతా రంగనాధబాబు అనుకున్నట్టే అయింది. వాళ్లందరూ తన చర్య గురించి చర్చ సాగిస్తున్నారన్నమాట.

బాబాయి తన గదిలోకి వచ్చాడు. "అప్పీ అమ్మాయి చెప్పింది. నువ్వేం బాధపడకు, ఎల్లుండి మంచి రోజు. బాబు మొక్కుబడి ఆరోజు తీర్చుకోవచ్చు. కాసేపు నిద్రపో రంగం! ప్రయాణం బడలిక తీరుతుంది." ఆయన వెళ్లిపోయారు.

ఆ సాయంత్రం చిన్ననాటి స్నేహితులతో ముచ్చటించి, చిట్టన్నయ్యతో పొలాలవైపు షికారెళ్లాడు. గడిచిన ఈ పదిహేనేళ్ల కాలంలో అన్నవరం కూడా ముందుకు పరుగెత్తినట్టయింది. ఊరంతా మారిపోయింది. చిక్కటి పొదల్లో చక్కటి ఇళ్లు తలెత్తాయి. ఇంటిముందు దయ్యపు చింతచెట్టు స్థానంలో హోటలూ, కిళ్ళీబడ్డీ వెలిశాయి. మట్టి రోడ్లు మచ్చుకైనా లేవు. సింహాద్రి, రామ్మూర్తి, గుర్నాధం అంతా మారి పోయారు. మాణిక్యం మామయ్య అమెరికా గురించి అరగంటైనా మాట్లాడగలడు. తన ముందు పుట్టిన పాలేరు కోటిగాడు పేపరు చదువుతాడుట. చైతన్యం, దాని తాలూకు ప్రభావం ఇంతగట్టిగా పని చేసిందంటే రంగ నాధబాబు ఆనందించాడు నిజంగా.

పొలాల గట్లు చిట్టన్నయ్యతోపాటు దాటు కొంటూ వస్తున్నాడు. చిట్టన్నయ్య చమత్కారం నేర్చుకొన్నాడల్లే ఉంది. అతని మాట లెంత విన్నా ఇంకా వినాలనిపిస్తున్నది. చిన్ననాటి సంగతులు వాళ్ళిద్దరి మధ్య ఎన్నో కదలిపోసాగాయి. బాగా చీకటిపడేవేళకు తిరిగి ఊళ్లోకి వచ్చారు.

"కాంతం మాస్టారు బావున్నారా చిట్టీ!" రంగనాధం అడిగాడు.

"బాగానే ఉన్నారు. వృద్ధాప్యం. పనేమీ చెయ్యలేరు. కొడుకులందరూ విడిపోయారు. ఉన్న ఆస్తంతా అయిపోయింది. అన్నట్టు నిన్నెప్పుడూ అడుగుతూంటారు. మీ వేదాంత గురువులు గామోను." చిట్టన్నయ్య ముసి ముసిగా నవ్వుకొన్నాడు.

"మాస్టార్ని చూడాలనుకొంటున్నావా?" అతని ఉద్దేశ్యాన్ని గమనించాడు గాబోలు చిట్టన్నయ్య.

"అవును—"

"బహుశా ఇప్పుడు తీరుబడిగా ఉంటారు. నే నింటికెళ్లి పనులు చూసుకొంటా. మాట్లాడా లనుకొంటే వెళ్లి మాట్లాడు." చిట్టన్నయ్య రంగనాధాన్ని విడిచి వెళ్లిపోయాడు.

అంతా మారినా మాస్టారిల్లుమాత్రం మారలేదు. అదే పెంకుటిల్లు. ఆ కుడివైపు గదిలోనే తనకు పాఠాలు చెప్పేవారు. ఇంతవరకూ ఆ ఇంటికి కరెంటు పడలేదు. ఇంటిదగ్గరకొచ్చి తలుపు తట్టాడు. "మాస్టారూ" అని పిలిచాడు. రుక్మిణమ్మగారు తలుపు తీశారు. ఆవిడ రంగనాధబాబును గుర్తుపట్టలేదు. తనే చెప్పుకున్నాడు.

"ఓ నువ్వా బాబూ! ఏమండీ! రంగబాబు వచ్చాడండీ. మిమ్మల్ని చూట్టానికి వచ్చాడు."

"ఎవరే—" నూతిలో గొంతులా వినిపించింది మాస్టారి మాట.

"రంగండి. మీ శిష్యుడు."

"నేనేనండీ!" అంటూ వచ్చాడు రంగనాధబాబు.

అయిదు నిమిషాల తర్వాత గాని మాస్టారు గుర్తించలేదు.

"నువ్వటరా రంగా! రా..రా.. కూర్చో, ఎప్పుడొచ్చావ్." ఆయనకు తన మీది వాత్సల్యం చెక్కుచెదరలేదు. ఆయన ముందు కుర్చీలో కూర్చున్నాడు రంగనాధబాబు. మాస్టారు హరికేన్‌లాంతరు సాయంతో ఏదో చదువుకొంటున్నారు. పుస్తకాన్ని మూసి రంగనాధబాబువైపు తదేకంగా చూస్తున్నారు.

---

## మీకు తెలుసా?

## జవాబులు

1. జర్మనీ దేశంలోని పిస్టోలా అనే ప్రదేశంలో తొలుత నిర్మించారు; కనుక చేతి తుపాకికి పిస్టల్ అనే పేరు పెట్టారు.

2. ఫ్రెంచి అకాడమీ అంచనా అనుసరించి మొత్తం 2,796 భాషలు.

3. నక్షత్ర కాంతి మనకు నిరంతరాయంగా చేరదు. నక్షత్రాలు మినుకు మినుకు మంటూ కన్పిస్తూ ఉంటాయి. కనుక వాటికి అయిదారు కోణాలు కల్పిస్తున్నాము. కాని అవికూడా గోళాకారంలోనే ఉంటాయి.

4. ఉన్నాయి; ఆస్ట్రేలియాలో డక్ మోల్, ఎచిడ్నా అనే ఎలుకలు గ్రుడ్లు పెట్టి, పొదిగి, పిల్లలకు పాలు ఇస్తాయి.

5. లేదు. పెన్సిల్‌లో ఉన్నది బొగ్గు లేక గ్రాఫైట్.

6. దక్షిణ అమెరికాలోని చింపరాసో. దాని ఎత్తు 20,702 అడుగులు.

7. గాలి గంటకు 75 మైళ్ళకు మించిన వేగంతో వీచితే తుఫాన్ అంటాము.

8. 'బెంజీన్' తో తయారు చేస్తారు. దీనిని 'స్విచెస్' మున్నగు నవి తయారుచేయడానికి ఉపయోగిస్తారు.


9. బ్రిటిష్‌వారు పది లక్షల మంది; జర్మనులు 20 లక్షల మంది నిహతులైనారు.

10. వాషింగ్టన్‌లో ఉన్నది; అమెరికా అధ్యక్షుని భవనం. దీనిని 1792 ప్రారంభంలో నిర్మించారు.

11. కలకత్తాలో ఒక గదిలో 146 మంది ఆంగ్లేయులను సిరాజ్ ఉద్దౌలా ఒక రాత్రి నిర్బంధించాడు. దానినే 'బ్లాక్ హోల్ ఆఫ్ కలకత్తా' అని పిలుస్తారు. మరునాటికి వారిలో 23 మంది మాత్రమే బ్రతికి ఉన్నారు.

12. మాస్కోలోని 'సోవియెట్ పాలెస్.' దీని ఎత్తు 1,365 అడుగులు.

★



ముగ్ధ ఫోటో—ప్రసాద్ (ఢిల్లీ—6)

# "అధికారీ- అంతరాత్మా"

"బాగా మారిపోయావూ—" ఆయన పెదవుల్లో లీలగా చిరునవ్వు మెరిసింది! రంగనాథబాబు తలవంచుకొన్నాడు.

"ఏం చేస్తున్నా విప్పుడు" మాస్టా రడిగారు. అతను అన్నీ సంగతులూ చెప్పాడు. చివర్ని అన్నాడు—

"నేను తప్పుచేశాను మాస్టారూ!"

మాస్టారు ఉలిక్కిపడ్డారు. ఏమిటన్నట్టు కళ్లతో అడిగారు.

"మీ రన్నారు—ఆత్మద్రోహం మహాపాపమని—నా ఆత్మను వంచించుకొన్నాను మాస్టారూ!" అతని కంఠం గద్గదమయింది.

"ఏమిటా ద్రోహం?" మాస్టా రడిగారు.

అతను జరిగిందంతా చెప్పాడు.

మాస్టారు గట్టిగా నవ్వారు.

రంగనాథబాబు నిశ్చేష్టుడయ్యాడు.

"మాస్టారూ! మీరూ నవ్వుతున్నారా?" నమ్మలేక అడిగాడు రంగనాథబాబు.

"ఇంకేం చెయ్యమంటావ్? ఊసుబోక చెప్పిన వేదాంతాన్ని వంట పట్టించుకొన్నావ్. ప్రతి చిన్న విషయాన్నీ బ్రహ్మాండం చేసుకొని బాధపడ్డంతప్ప నీకేం చేతగాదు. చూడు రంగా! వేదాంతమనేది సమయానుకూలంగా ఆచరణలో పెట్టుకోవాలి. అంతేగాని తు. చ. తప్పకుండా పాటిస్తే ఈ లోకం అందుకు స్థానంకాదు. వేదాంతంకంటె ముఖ్యం లౌక్యం. ప్రాముఖ్యం లౌక్యానికే నాయనా! మనిషన్నవాడు పొరపాట్లు చేయకుండా బ్రతకలేడు. ఆమాటకొస్తే ఏ పొరపాటూ చెయ్యకుండా బ్రతికాడూ అంటే అదే ఒక పొరపాటు. కాబట్టి నువ్వు చేసినదాన్లో నేర మేమీలేదు. పైగా డాక్టరులాటి వాళ్ళు నీ జీవితానికి ఎప్పుడూ కావాల్సిన మనుషులు. అర్థం చేసుకో రంగా!" మాస్టారు చిన్న ఉపన్యాసంలాటి దిచ్చారు.

ఇదేమిటి? మాస్టారు కూడా ఇలా మాట్లాడుతున్నారు? ఎవరిదగ్గర తను ఓదార్పు పొందాలని ఇంతదూరం వచ్చాడో, ఎవరి దగ్గర తను చేసిన తప్పు చెప్పుకొని క్షమాభిక్ష కోరాలని వచ్చాడో-వారే ఈ విధంగా మాట్లాడితే తనేం కావాలి?

"నే చెప్పింది నీకు నచ్చలేదా? ఇదీ ఒక సత్యమే నాయనా! మనమంతా అవకాశవాదులం. బ్రతికి బాగుపడాలనుకొన్న ప్రతివాడూ అవకాశాన్ని అంటిపెట్టుకొని ఉండాలి. అడవుల్లో ముక్కు మూసుకొని తపస్సు చేసుకునే వాళ్లకు తప్ప వేదాంతం మనకు కాదు. అం త మా త్రా న వేదాంతాన్ని చులకనచేసి పారెయ్యకూడదు—ఇదంతా అవకాశమే నేర్పుతుంది. అంతే కాని చదువుకుంటే వచ్చేదికాదు." కాంతం మాస్టారు గూడా లౌక్యుడేనా?

"అయితే నే చేసింది తప్పుకాదా మాస్టారూ?" తగ్గుస్థాయిలో ఈమాట అన్నాడు రంగనాథబాబు.

"ఎంతమాత్రం కాదు. బాధపడకు నాయనా. నిశ్చింతగా ఉండు. ఇంకా నువ్వు జీవితాన్ని చదువుకోలేదంటే ఆశ్చర్యంగా ఉంది నాకు—" కాంతయ్య మాస్టారు మాట పూర్తి చెయ్యకముందే గుమ్మం దగ్గర చప్పుడయింది. ఎవరో వచ్చినట్టుంది.

"రామూ వచ్చాడండి. రండి రండి త్వరగా" రుక్మిణమ్మగారు మాస్టార్ని ఆత్రుతగా పిలిచింది. మాస్టారు హడావిడిగా లేచారు.

"రామూ వచ్చాడా?... ఉద్యోగం దొరికిందా నాయనా?" ఆశగా అతని దగ్గరికి వెళ్లారు.

"లేదునాన్నా—మోసం తెలిసింది. లోకం తెలిసింది" దాదాపు ఏడుస్తూ చెప్పాడు. ఆ గొంతు విన్న రంగనాథబాబు ఉలిక్కిపడ్డాడు! నిశ్చేష్టుడయ్యాడు! ఆదే గొంతు. గుడ్డిదీపం వెలుతుర్లో అతన్ని చూశాడు. అతనే!—అదేవ్యక్తి! రామారావ్!!!

ఇతను మాస్టారుగారబ్బాయా? 'భగవాన్! ఏమిటి నీ విచిత్ర లీల!' పిచ్చిగా లోలోన గొణుక్కున్నాడు. 'నన్ను మోసం చేసింది ఈయనే' అని రామారావు తనను చూపితే—మాస్టారుకేం జవాబివ్వాలి? మాస్టా రేమను కుంటారు? 'మనమంతా అవకాశవాదులం—' ఈ మాట నిలబెట్టుకుంటారా మాస్టారు?

రామారావు దిగులుగా పక్క గదిలోకి వెళ్లాడు. అతనితోపాటు కృంగిపోయిన అమ్మకూడా వెళ్ళింది. ఏమీ తోచని మాస్టారు "అసలేం జరిగిందిరా" అంటూ తల్లీ కొడుకుల్ని అనుసరించాడు.

అదను దొరికిందే చాలనుకున్న రంగనాథబాబు లేచాడు. మెల్లిగా, దొంగలా బయట పడ్డాడు. ఆ చీకటిలో ఇంటివైపు నడక సాగించాడు. ★